క్లుప్తంగా

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఐలయ్య



ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న బన్న ఐలయ్యను హనుమకొండ జిల్లా తెలంగాణ ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం, వారి సమస్యలు, అభివృద్ధి కోసం, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు జిల్లా అధ్యక్ష పదవి కేటాయించిన రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు నారాయణ, గొంటి రవి, ఉపాధ్యక్షులు కర్ణాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

దామెర: మండలంలోని సీతారాంపూర్‌లో నిర్వహించ తలపెట్టిన శ్రీరాముని కల్యాణమహోత్సవం కార్యక్రమాలకు ముస్లింసోదరులు సైతం ముందుకు వచ్చి చందా రూపంలో డబ్బులు ఇవ్వడంతో గ్రామంలో మతసామరస్యం వెల్లివిరిసింది. రానున్న శ్రీరామనవమి రోజున గ్రామంలోని ఆలయంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు సేవాదళ్, యూత్ సభ్యులు, గ్రామపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేయడంతో గ్రామంలోని పలువురు ముందుకు వచ్చి చందారూపంలో డబ్బులు ఇవ్వడం జరిగింది. కాగా విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ముస్లింలు ఎండీ ఇస్మాయిల్, ఎండీ. మహ్మద్ ఉల్‌హక్, ఎండీ. రంజాన్, ఎండీ. రఫీక్, ఎండీ. సాధిక్, ఎండీ. చోటేమియా, ఎండీ. జోర్ మహ్మద్‌లు ముందుకు వచ్చి తమవంతు సాయంగా డబ్బులు ఇచ్చారన్నారు. దీంతో వారిని గ్రామస్తులతో పాటు విషయం తెలిసిన ప్రతి ఒక్కరూ అభినందించారు.

క్రీడాకారిణికి సన్మానం



ఆత్మకూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న కరిష్మాబేగం ఇటీవల ఆదిలాబాద్‌లో జరిగిన అంతర్ రాష్ట్రహ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ బి.నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మండలంలోని చిన్న గ్రామమమైన హౌజ్ బుజుర్గులో జన్మించిన కరిష్మా బేగం క్రీడల్లో రాణించడం అభినందనీయమన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇమామ్ పాషా, ఫాతిమా బేగంలను కూడా అభినందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బాలునాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తకు రక్తవీర్ అవార్డు ప్రదానం



పరకాల: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని పురస్కరించుకొని పరకాలకు చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌కే ముస్తాఫాకు రక్తవీర్ అవార్డు ప్రదానం అందజేశారు. వరంగల్‌లోని లూయిస్ అంధుల ఆదర్శ పాఠశాల ఆవరణలో యువనేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలలు నిర్వహించారు. సమాజసేవ, రక్తదానంపై అవగాహన కల్పిస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు సామాజిక కార్యకర్తలకు రక్తవీర్ అవార్డులను ప్రదానం చేశారు.కార్యక్రమంలో ప్రముఖ సైక్రియాజిస్టు బరుపాటి గోపి, ఎర్రబెల్లి ప్రదీప్‌కుమార్, యువనేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కన్నె రాజు, డాక్టర్ మేఘన, డాక్టర్ అజిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి, సింగారం, పున్నేలు, ఐనవోలు గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఐనవోలు సబ్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఏఈ ఎం.శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐనవోలు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఒంటిమామిడిపల్లి ఫీడర్‌కు సంబంధించిన బ్రేకర్ పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్

- ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని విడిచిపెట్టం
- నిజాయితీ అధికారులకే పట్టం కడతాం
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

శాయంపేట : రూ.16, 500కోట్ల నిధులతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రూ.20లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీకె ఫంక్షన్ హాల్‌లో బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్ల నిధులను నీళ్లలో ముంచారని, రూ.25వేల కోట్లను సీఎండీ ప్రభాకర్ రావు విద్యుత్ శాఖకు అప్పులు తెచ్చారని, రూ.60వేల కోట్ల నిధులను మిషన్ భగీరథలో మాజీ సీఎం కేసీఆర్ అవినీతిమయం చేశారని ఆరోపించారు. నిరుపేదలకు ఏ ఒక్క రూపాయి లంచం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటే పదవులు మనవెంట ఉరికివస్తాయని, కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. అలాగే ఉన్నత పదవులు కట్టబెడతానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న బాలాజీ, రోబో సాండ్లపై విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేపట్టి భూములను ఆక్రమిస్తే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే సత్యనారాయణరావు హెచ్చరించారు. భారీ వర్షాలతో భూపాలపల్లి నియోజకవర్గంలో 124 చెరువులు తెగిపోగా అప్పటి ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈ విషయాన్ని తాను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని అతి త్వరలోనే వానాకాల పంటలకు సాగునీరు అందేలా 124 చెరువుల్లో శాశ్వత మరమ్మతు పనులను చేపడుతానన్నారు. తన ప్రాణం ఉన్నత వరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తానని, తెలంగాణ రాష్ట్రంలోనే భూపాలపల్లి నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉంచేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ భూముల్లో వేసుకున్న గుడిసెవాసుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలని, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, సర్పంచ్‌లు కందగట్ల రవి, అబ్బు ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు బాసాని చంద్రప్రకాశ్, గజ్జి ఐలయ్య, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, కృష్ణమూర్తి, కుమారస్వామి, కృష్ణమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుడి, బడి పక్కనే మద్యం షాపు

- తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరకాల: దేవాలయంతో పాటు విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న పరకాల పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులోని శివవైన్స్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీస్, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దేవాలయాలు, విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఉండాలనే నిబంధనలను ధిక్కరిస్తూ మద్యంషాపు ఏర్పాటు చేయడంతో భక్తులు, విద్యార్థులు తీవ్ర అసౌకార్యానికి గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైన్స్ కారణంగా నిత్యం ప్రధానరహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, ఎంఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు బొచ్చు ప్రశాంత్ ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు



కటాక్షపూర్ పెద్ద చెరువు కట్ట వెంబడి మట్టి తవ్వుతున్న దృశ్యం

ఆత్మకూరు : మండలంలోని జాతీయ రహదారి 163 పై ఉన్న కటాక్షపూర్ చెరువు కట్ట సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వుతున్నారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి మట్టి తరలించడంతో చెరువులో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పుడు కట్ట వెంబడే తవ్వుతుండటంతో మరిన్ని గుంతలు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. మేడారం జాతర సమీపిస్తున్న తరుణంలో భక్తులు, యాత్రికులు చెరువు వద్ద సేద తీరడానికి ఆగుతారు. చెరువులో గుంతలు ఏర్పడితే ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా చెరువులో మట్టి తవ్వకాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజలతో మమేకమైనప్పుడే గుర్తింపు



ఎంపీడీఓ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఎంపీటీసీలు, కార్యాలయ సిబ్బంది

శాయంపేట : ప్రజలతో మమేకమై పని చేసినప్పుడే అధికారులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్ అన్నారు. ఎంపీడీఓగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఆమంచ కృష్ణమూర్తికి బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణమూర్తిని పూలమాలలు, శాలువా, మెమొంటోలతో సత్కరించారు. అనంతరం ఎంపీటీసీ చంద్రప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని అన్నారు. నిజాయితీతో పనిచేసే ఉద్యోగులకు తగిన గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఓ అనిత, సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎడ్ల దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్



శాయంపేట : ఎడ్ల దొంగతనం కేసులో ఇద్దరి నిందితులను పట్టుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు స్థానిక సీఐ మల్లేష్ తెలిపారు. మండల కేంద్రంలోని సీఐ చాంబర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరకాలకు చెందిన మోరే సాయికుమార్ చిన్నతనంలో చదువు అబ్బక దొంగతనం చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. సాయికుమార్ పరకాలలోని ఎండీ.అనీఫ్ మటన్‌షాపులో పనిచేసేవాడు. అతను ఇచ్చే డబ్బులు సరిపోకపోవడంతో గ్రామాల్లో కట్టేసి ఉంచిన ఎడ్లను దొంగతనం చేస్తూ అనీఫ్‌కు అప్పజెప్పేవాడు. వాటిని మాంసాన్ని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. పెద్దకోడెపాకకు చెందిన బుట్టి చంద్రమోహన్‌కు చెందిన ఎద్దును ఈ నెల 21న, తహరాపూర్‌కు చెందిన భారత భిక్షపతికి చెందిన ఎద్దును ఈ నెల 7న అపహరించినట్లు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎద్దుల దొంగతనం విషయంలో పోలీసులు విచారణ చేపట్టి సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా సాయికుమార్, అనీఫ్‌లను గుర్తించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ మల్లేష్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు: నందనం శివారు ఆకేరువాగు పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ఇసుక ట్రాక్టర్లను ఎస్సై అనిల్‌కుమార్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లే కుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మే రకు బుధవారం ఉదయం సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా 9 ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్లు, య జమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

నడికూడ: అంబాల–హనుమకొండ ప్రధానరోడ్డుపై నాగారం గ్రామ సమీపంలో మంగళవారం బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన బూర రాజ్‌కుమార్ (35) తీవ్రంగా గాయపడ్డాడు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గీసుకొండ : వరంగల్–నర్సంపేట రహదారిపై జాన్‌పాక వద్ద ఈనెల 19న జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ మండల పరిధిలోని అంబాలకు చెందిన భిక్షపతి (47) ఎంజీఎం ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 19న ద్విచక్ర వాహనంపై గీసుకొండ మండలంలోని కొమ్మాలకు వెళ్లి వస్తుండగా జాన్‌పాక చర్చి వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకన్న తెలిపారు.

ఫిబ్రవరి 29లోపు రైతుబంధు అందించాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్: ఫిబ్రవరి 29 లోపు రైతులందరికీ రైతుబంధు జమ చేస్తే రైతుల వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉంటుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నిమ్మ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా వివిధ శాఖల అధికారులు వారి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేసుకుంటున్నారని, వారికి సరైన సమయానికి రైతుబంధు నిధులు అందిస్తే పెట్టుబడులకు ఉపయోగపడుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల 31తో ముగుస్తుందని, మీరు కుంగిపోవాల్సిన అవసరం లేదని పని చేసే వారిని ప్రజలే గుర్తిస్తారని తెలిపారు. గతంలో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు అధికారులు త్వరగా ఎంబీ రికార్డులు చేసి పెట్టాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు ఎంత మందికి రైతుబంధు పడింది, ఎన్ని ఎకరాలకు పడిందో వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక తయారు చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఒక నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సర్పంచ్‌లకు చివరి సర్వసభ్య సమావేశం కావడంతో వారిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, తహసీల్దార్ జి.సదానందం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పనులు చేపడితే అభివృద్ధి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సుదర్శన్

ఎల్కతుర్తి: గ్రామాల్లో నిర్వహించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం చేపట్టినట్లయితే అభివృద్ధి సాధ్యపడుతుందని డీఎల్‌పీఓ సుదర్శన్ అన్నారు. 2024–25కు సంబంధించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికపై బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని రైతు వేదికలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, ధర్మసాగర్, వేలేరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి జీపీ నిధులతో పాటు ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను రూపొందించుకోవాలన్నారు. జీపీడీపీ (గ్రామ పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్) ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. సమావేశంలో అధికారులు రాజు, రవిబాబు, పూర్ణచందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే విక్రయించాలి



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఏఈఓ శ్రీనివాస్

నడికూడ: ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని పరకాల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చర్లపల్లి, వరి కోల్ గ్రామాల్లో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పురుగు మందులను, రికార్డులను, క్యూ ఆర్ కోడ్‌లను, లేబుల్స్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుత్తం ఎలాంటి ఎరువులకు కొరత లేదని, యూరియా కృత్రిమ కొరత సృష్టించకూడదని, రైతులు కోరిన ఎరువులనే విక్రయించాలని ఎరువుల డీలర్లకు సూచించారు. అధిక ధరకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

జిల్లాస్థాయి ప్రతిభా పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో బుధవారం మండలస్థాయి ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాల విద్యార్థులు సిద్ధు, మహేందర్, బన్నీలు విజేతలుగా నిలిచి ఈ నెల 27న హనుమకొండలో జరిగే జిల్లా స్థాయి ప్రతిభా పోటీలకు ఎంపికయ్యారని గైడ్ టీచర్ కిరణ్మయి తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం ధర్మప్రకాష్, ఉపాధ్యాయులు స్వర్ణలత, సురేష్, పద్మజ, రాజమ్మ, ప్రసన్న, సహ విద్యార్థులు అభినందించారు.

బాలికలు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



ధర్మసాగర్: మాట్లాడుతున్న కడియం కావ్య



దామెర : ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు



కమలాపూర్: మాట్లాడుతున్న వైద్యాధికారి నాగరాజు

ధర్మసాగర్: పాఠశాల విద్య స్థాయిలోనే బాలికలు బాలురతో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ కడియం కావ్య పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని ముప్పారం కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సవాళ్ల సమాజంలో బాలికలు మరింత చురుకైన పాత్ర పోషించడం ద్వారా దిశానిర్దేశకులుగా రూపుదిద్దుకోవచ్చని తెలిపారు. జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ అస్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలు చదువులో ముందంజలో ఉండాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో అధ్యాపకురాలు జ్యోతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి,తదితరులు పాల్గొన్నారు

అమ్మాయిలు లేనిదే ప్రపంచం లేదు

కమలాపూర్: అమ్మాయిలు లేనిదే ఈ ప్రపంచం లేదని, అమ్మాయిలు లేని ప్రపంచాన్ని ఊహించుకోలేమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. కమలాపూర్‌లోని కేజీబీవీ, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో కమలాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య మేళా నిర్వహించి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలికా దినోత్సవం ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థినులచే భేటీ బచావో–భేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో కేజీబీవీ ఎస్వో అర్చన, ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి, ఎంపీహెచ్ఓ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ విప్లవ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ బాబు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

దామెర: మండల వ్యాప్తంగా జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సబితాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఊరుగొండ, పులుకుర్తి, కోగిల్వాయి, ముస్త్యాలపల్లి, ల్యాదెళ్ల పాఠశాలల్లో సమాజంలో బాలికల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నడికూడ: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదలపై బుధవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ– 2 టీచర్ సంపూర్ణ, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

శాయంపేట : బాలికలు లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వైద్యాధికారిణి డాక్టర్ విద్యశ్రీ అన్నారు. మండలంలోని గోవిందాపూర్ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను స్పెషల్ ఆఫీసర్ మాధవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యశ్రీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన ఒకేషనల్ మెటీరియల్‌ను చూసి అభినందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కలెక్టర్‌తో అవార్డు అందుకున్న విద్యార్థిని

శాయంపేట : మండలలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన శ్వేత స్టూడెంట్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చింది. బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి శ్వేతను స్పెషల్ ఆఫీసర్ మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

వేలేరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం వేడుకలను పాఠశాల ఎస్ఓ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. తహసీల్దార్ కోమి, వైద్యాధికారి నవీన్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



నడికూడ : పిల్లలతో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు



వేలేరు: మెమొంటో అందజేస్తున్న అనితారెడ్డి



శాయంపేట: శ్వేతకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ శంకర్

దామెర: గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల నర్సరీని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి నర్సరీకి నిర్దేశించిన 10 వేల మొక్కల టార్గెట్‌ను చేరుకోవాలని అన్నారు. నాటిన మొక్కలకు సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాలని పేర్కొన్నారు. షెడ్ నెట్స్, నీటి వసతి ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, తదితరులు ఉన్నారు.